# అది ప్రశ్న - ఇది జవాబు

* రచన : కుమారి కూర్రిపాటి శకుంతలారాణి *

[యువతీ యువకులకి చక్కని జోడు కుదిరినంత మాత్రాన-అది ఆదర్శ దాంపత్యం అని అనిపించుకోదు. మనస్సులు కలిసిన జంటల మధ్య అందచందాలు అడ్డుగోడలుగా నిలవలేవు —రచయిత్రి]

★

ఆనందరావుకి చాలా సందేహాలు కలుగుతున్నాయి మొన్ననీ మధ్యనుంచే! తన భవిష్యత్ సంసార జీవితం ఎలా వుంటుంది? తన కెలాటి భార్య వస్తుంది? గుణవతా? రూపవతా? లేక సుగుణ మరియు సుందరా?... అనేదే ప్రశ్న?

ఆనందరావు భయపడ్డాడు, జరుగుతూన్న తతంగం చూచి అసహ్యించుకున్నాడు. మార్పులేని మామూలు జీవితం గడుపుతున్న మనుష్యుల వేపు పరీక్షగా చూసి విసుగు చెందాడు. సగటున అందరి సంసార జీవితాల్లో ఏర్పడుతూన్న అశాంతి భావసంఘర్షణ, అతను భయపడడానికి దోహదం చేసాయి.

ఆనందరావులో పరవళ్ళు తొక్కుతున్న యౌవ్వనం ఉంది. పదిహేనేళ్ళ వయస్సు వచ్చిందాకా అతన్ని అంటుపెట్టుకున్న బాల్యం అతన్నించి దూరంగా పారిపోయి ఇప్పటికి సరిగ్గా పదేళ్ళయింది. దాంతో "అబ్బాయికి పెళ్ళీడు వచ్చింది" అని వాళ్ళ నాన్న సంభంధాలు చూట్టం మొదలు పెట్టేరు.

అతను తన సందేహాలకి జవాబు దొరక్క బాధపడుతున్న సమయాన వాళ్ళ నాన్న దగ్గర్నుంచి టెలిగ్రాం రానేవచ్చింది. ఆ టెలిగ్రాంలో అదృశ్యంగా నిలుచున్న వాళ్ళ నాన్న ఆనందరావు వేపుచూసి పెళ్ళని బెదరించి ఫలానా తేదీనాటికి రమ్మని హుకుంజారీ చేయగా-అమాయకుడు ఆనందరావు అదిరి పడ్డాడు. వివాహం నూరేళ్ళపంట! ఈడూ జోడూ కుదిరిన దంపతుల కాపురం చూడ ముచ్చటై మూడు పూవులూ ఆరు కాయలుగా ప్రకాశిస్తుందంటారు. ఆనందరావు చూసిన ప్రతిజంటా, అతనికి ముచ్చట కలిగించకపోగా అసహ్యాన్నే కలిగించింది.

పక్కింటి కిటికీలోంచి భయంకరంగా కనిపించే ఆ మహాతల్లి సుందరవదనారవిందం జ్ఞాపకానికి వస్తే చాలు హోటలు మెతుకులు అతనికి నహించేవి కావు. ఆవిడ భర్త అందమైనవాడు. భార్య కురూపి. అటువంటి కురూపి భార్యతో తను ఇంత ఆనందాన్ని ఎల్లా పంచుకో గలుగుతున్నాడో అని ఆనందరావు ఆశ్చర్య పడుతూండేవాడు.

పితృదేవుడి ఆజ్ఞను మోసుకొచ్చిన టెలిగ్రాంలో పక్కింటి మహంకాళి ముఖం కనిపించగానే ఆనందరావ్ మనస్సు మొద్దుబారిపోయింది. ఆ క్షణం నుంచి కాబోయే భార్యపైన అతని ఊహ నిలిచిపోయింది. రేపు తను చేయబోయే సంసారం తీయగా ఉండాలని తలపుతో ఎన్నో కలలు వచ్చినా ఆ కలల్లోనే ఎంతో సంతోషించినా భయం మాత్రం అంతకంతకూ హెచ్చు పెరిగింది.

పెళ్ళి చూపుల్లోనూ, పెళ్ళి పీటలమీదా శ్రీమతిని చూచుకుని అతను ఎంతగానో సంబర పడ్డాడు. తన కలలు నిజమౌతాయని అందరిలా కాక తమ జంట చూడ ముచ్చటగా భాసిల్లు తుందని ధైర్యం తెచ్చుకున్నాడు. కన్న కలలు ఆరంభ ఘడియలులో ఆ రాత్రి చుట్టూ చేరిన తెల్లమల్లెల నవ్వుల వెలుగుల మధ్య కూచుని ఆనందరావు మరుసటి క్షణాన్ని మరింత అందంగా ఊహించుకుంటున్న తరుణంలో శ్రీమతి రానే వచ్చింది. రాణిగారి రాకతో ఆనంద రావులోని కోటి కోర్కెలు ఒక్కసారిగా మేల్కొని అతన్ని నిలబడేట్టు చేసింది. ఆనంద రావు సుభద్రని చూసి చిరునవ్వు నవ్వాడు. చేయి ముందుకి చాచి ఆమె చేతిని స్పర్శించ పోయాడు. ఆమె తన చేతిని అతనికి అందీయ లేదు, విరుసుగా వెళ్ళి ఆ మూలనున్న కుర్చీలో కూర్చుంది.

"తొలి రాత్రి! పాపం సిగ్గు" అనుకున్న ఆనందరావు పిల్లినడకతో సుభద్ర దరిచేరి భుజాలపై చేయివేసి "సుభద్రా" అన బోయాడు.

ఆమె చివాలున లేచి నిలుచుని ఆనందరావు వేపైనా చూడకుండా "నా కీలాంటి వంటె అసహ్యం" మా అమ్మ నూతిలో పడి చస్తా నంటె నేనీ పెళ్ళికి ఒప్పుకున్నా! మీరు చదువు కున్నవారు, ఈ మాత్రం చెబితె చాలను కుంటాను, దయచేసినన్ను తాకకండి వేరేగదిలో వెళ్ళి పండుకోండి అన్నది.

ఆనందరావు నిలువెత్తు శిలా విగ్రహమే అయిపోయాడు. కలలకీ-భయానికీ-అసహ్యానికీ ఇది జవాబు.

★

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులుకాదు. —సంపాదకుడు.

★

రాజేశ్వరి చిత్రవారి "తల్లే చల్లని దైవం" చిత్రంలో ప్రభ, మురళీమోహన్



★